

అల్లు అర్జున్ కథానాయకుడిగా సుకుమార్ దర్శకత్వంలో రూపొందించిన పాన్ ఇండియా చిత్రం 'పుష్ప-2' డిసెంబర్ 5న ప్రేక్షకుల ముందుకురాబోతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రచారపర్వాన్ని వేగవంతం చేశారు. ఈ సినిమాలో అల్లు అర్జున్, శ్రీలీలపై చిత్రీకరించిన 'కిస్సిక్..' అనే ప్రత్యేకగీతాన్ని ఈ నెల 24న చెన్నైలో జరిగే ఈవెంట్‌లో రిలీజ్ చేయబోతున్నారు. ఈ సందర్భంగా గురువారం పాట తాలూకు స్టిల్‌ను విడుదల చేశారు.

# 50 ఏండ్ల పండగ



అగ్ర నటుడు మోహన్‌బాబు నటుడిగా 50ఏళ్లు పూర్తి చేసుకున్నారు. శోభన్‌బాబు హీరోగా వచ్చిన 'కన్నవారి కలలు'(1974) నటుడిగా ఆయన తొలి సినిమా. ఈ సినిమాలో ఓ చిన్న పాత్ర పోషించారాయన. ఆ తర్వాత దర్శకరత్న దాసరి నారాయణరావు దగ్గర సహాయ దర్శకుడిగా పనిచేసి, ఆయన దర్శకత్వంలో వచ్చిన 'స్వర్గం-నరకం'(1975)తో హీరోగా మారారు. అప్పట్నుంచి మోహన్‌బాబు వెనుదిరిగి చూసుకోలేదు. విలన్‌గా దశాబ్దానికి పైగా తిరుగులేని ప్రస్థానాన్ని సాగించారు. 1982లో లక్ష్మీప్రసన్న పిక్చర్స్‌ని స్థాపించి 'ప్రతిజ్ఞ' చిత్రంతో నిర్మాతగా మారారు. ఆ తర్వాత అదే సంస్థలో 75 చిత్రాలను నిర్మించారు. అటు హీరోగా, ఇటు విలన్‌గా, మరోవైపు కమెడియన్‌గా రకరకాల పాత్రలు చేస్తూ వెర్సటైల్ ఆర్టిస్టుగా గుర్తింపు తెచ్చుకుంటూ, నిర్మాతగా కూడా దూసుకుపోతున్న మోహన్‌బాబుకు 'అల్లుడుగారు'(1990) హీరోగా తొలి బ్రేక్ ఇచ్చింది. అసెంబ్లీరౌడీ, రౌడీగారిపెళ్లాం, అల్లరిమొగుడు, బ్రహ్మ, సోగ్గాడి పెళ్లాం ఇలా వరుస విజయాలతో 'కలెక్షన్ కింగ్'గా అవతరించారాయన. 1995లో వచ్చిన 'పెదరాయుడు'తో ఇండస్ట్రీ హిట్‌ని అందుకున్నారు. మహానటుడు ఎన్టీఆర్‌తో ఆయన నిర్మించిన 'మేజర్‌చంద్రకాంత్' నేటికీ తెలుగువారికి అభిమాన చిత్రమే. తెలుగు సినిమాకే కాకుండా, శ్రీవిద్యా నికేతన్ ద్వారా విద్యారంగానికి కూడా చేసిన సేవలకు కేంద్ర ప్రభుత్వం 2007లో ఆయన్ను పద్మశ్రీ పురస్కారంతో గౌరవించింది. 2016లో ఫిల్మ్‌ఫేర్ జీవిత సాఫల్య పురస్కారాన్ని కూడా మోహన్‌బాబు అందుకున్నారు. సినీ కళాకారుడిగా 50ఏండ్లు మోహన్‌బాబు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయన తనయుడు మంచు విష్ణు ప్రత్యేక ఈవెంట్లు నిర్వహించనున్నారు. ఈ డిసెంబర్ నుంచి వచ్చే ఏడాది నవంబర్ వరకూ ప్రతి నెల ఒకటో తేదీన, ఏడాది పాటు ఈ ఈవెంట్లు జరుగుతాయని మంచు విష్ణు ఓ ప్రకటన ద్వారా తెలియజేశారు. ప్రస్తుతం మోహన్‌బాబు 'కన్నప్ప' చిత్రం నిర్మిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో ఆయన మహాదేవశాస్త్రిగా కీలక పాత్ర పోషిస్తున్నారు.

# విధి మనల్ని నడిపిస్తుంది

' 'సారంగపాణి జాతకం' టీజర్ చూశాను. చాలా బావుంది. అందులో దర్శి పాత్రకు జాతకాల పిచ్చి. నిజానికి జాతకాలు ఎంతవరకూ నిజం అనేది నాకూ తెలియదు. డెస్టినీ మనల్ని నడిపిస్తుంది అని మాత్రం నమ్ముతా. 'పెళ్లి చూపులు' చేసేటప్పుడు నేనూ, దర్శి ఈ స్థాయికి వస్తామని అనుకోలేదు. దర్శితోనే నా కెరీర్ స్టార్ట్ అయ్యింది. ఇప్పుడు దర్శి ప్రయాణం చూస్తుంటే నాకెంతో హ్యాపీగా ఉంది. ఇంట్రస్టింగ్ కథల్లో లీడ్‌రోల్స్ చేస్తూ మనకు మంచి సినిమాలు అందిస్తున్నాడు. 'సారంగపాణి జాతకం' కూడా పెద్ద హిట్ కావాలని కోరుకుంటున్నా' అని విజయ్ దేవరకొండ అన్నారు. ప్రియదర్శి హీరోగా ఇంద్రగంటి మోహనకృష్ణ దర్శకత్వంలో శివలెంక కృష్ణప్రసాద్ నిర్మించిన చిత్రం 'సారంగపాణి జాతకం'. డిసెంబర్ 20న సినిమా విడుదల కానుంది. గురువారం స్టార్ హీరో విజయ్ దేవరకొండ ఈ సినిమా టీజర్‌ని లాంచ్ చేసి మాట్లాడారు. ఇక టీజర్ విషయానికొస్తే..



రకరకాల ప్రశ్నలు ఉత్పన్నమయ్యేలా ఆద్యంతం వినోదభరితంగా ఈ టీజర్ సాగింది. వెన్నెలకిశోర్, అవసరాల శ్రీనివాస్ డైలాగులు టీజర్లో నవ్వించాయి. రూప కొడువాయూర్ కథానాయికగా నటించిన ఈ చిత్రంలో నరేష్, తనికెళ్ల భరణి, వైవా హర్ష, శివన్నారాయణ, అశోక్‌కుమార్ ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: పి.జి.విందా, సంగీతం: వివేక్ సాగర్, నిర్మాణం: శ్రీదేవి మూవీస్.

# సందేశంతో 'ఝాన్సీ ఐపీఎస్'



లక్ష్మీరాయ్ ప్రధాన పాత్రలో నటించిన 'ఝాన్సీ ఐపీఎస్' చిత్రం తమిళంలో మంచి విజయాన్ని సాధించింది. గురుప్రసాద్ దర్శకుడు. ఈ సినిమాను ఆర్.కె.ఫిల్మ్స్ పతాకంపై ప్రతాని రామకృష్ణ గౌడ్ తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. ఈ నెల 29న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆర్.కె.గౌడ్ మాట్లాడుతూ 'ఈ చిత్రంలో లక్ష్మీరాయ్ త్రిపాత్రాభినయం హైలైట్‌గా నిలుస్తుంది. పోరాట ఘట్టాలు థ్రిల్‌ని పంచుతాయి. డ్రగ్స్ ముఠాల ఆటకట్టించి, గ్రామాల్లో రౌడీల ఆగడాలకు అడ్డుకట్టవేసే డాషింగ్ పోలీస్ ఆఫీసర్‌గా లక్ష్మీరాయ్ పాత్ర అందరిని మెప్పిస్తుంది. అంతర్లీనంగా చక్కటి సందేశం మేళవించిన కథాంశమిది. త్వరలో ప్రీరిలీజ్ వేడుకను నిర్వహిస్తాం. భారీ స్థాయిలో ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం' అన్నారు.

# రియల్ ఇన్సిడెంట్స్‌తో ఈ కథ రాశారు



'బ్లాక్ మనీ, వైట్ మనీ చుట్టూ తిరిగే కథ ఇది. బ్లాక్ అండ్ వైట్‌కి సింబాలిక్‌గా ఉంటుందనే డైరెక్టర్ ఈ సినిమాకు 'జీబ్రా' అనే టైటిల్ పెట్టారు. ఎవరు మంచి, ఎవరు చెడు అనేది ఇందులో చివరిదాకా తెలీదు. ప్రతిఒక్కరిలో గ్రే వుంటుంది.' అని సత్యదేవ్ అన్నారు. ఆయన హీరోగా రూపొందిన చిత్రం 'జీబ్రా'. ప్రియా భవానీ శంకర్, జెన్నిఫర్ పిషినాటో హీరోయిన్లు. ఈశ్వర్ కార్తిక్ దర్శకుడు. ఎస్ఎన్‌రెడ్డి, ఎస్.పద్మజ, బాల సుందరం, దినేష్ సుందరం నిర్మాతలు. ఈ శుక్రవారం సినిమా రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా సత్యదేవ్ విలేకరులతో మాట్లాడారు. 'ప్రస్తుతం బ్యాంక్ సిస్టమంతా డిజిటల్ అయ్యింది. క్రైమ్ చేయడం ఈజీ కాదు. అందులో పనిచేసేవాళ్లకు తప్ప, సామాన్యులకు అక్కడ జరిగే మిస్టేక్స్ తెలీదు. దర్శకుడు ఈశ్వర్ కార్తిక్ గతంలో బ్యాంక్ ఉద్యోగి. ఆయన చూసిన రియల్ ఇన్సిడెంట్స్‌కి మరికొన్ని ట్రూ ఇన్సిడెంట్స్‌ని యాడ్ చూసి ఈ కథ రాశారు. ఏటీఎంలో మనం డబ్బులు తీస్తున్నప్పుడు ఓ సౌండ్‌తో డబ్బులు బయటికి వస్తాయి. ఆ సౌండ్ వెనుక ఏం జరుగుతుంది? అనేదే ఈ సినిమా' అని సత్యదేవ్ తెలిపారు. డాలీ ధనంజయ్, సత్యరాజ్, సత్య, ప్రియా భవానీశంకర్ ఇలా అందరూ ప్రాణం పెట్టి పనిచేశారని, టెక్నికల్‌గా ఉన్నతంగా ఈ సినిమా ఉంటుందని, తన కెరీర్‌కి మేలి మలుపుగా ఈ సినిమా నిలుస్తుందని సత్యదేవ్ నమ్మకం వ్యక్తం చేశారు.

# రిస్క్ చేసి ఓడిపోయావా?



వర్కవుట్లతో శారీరకంగా.. జీవితంలో ఎదురైన అనుభవాలతో మానసికంగా స్ట్రాంగ్ అయ్యింది సమంత. ఈ మధ్య కొన్ని వేదికలపై ఆమె మూర్తీభవించిన ఆత్మవిశ్వాసంతో కనిపించింది. ఇన్‌స్టా ద్వారా తన ఫొటోలతో సందడి చేయడమేకాక, అప్పుడప్పుడు సాటి స్త్రీలను చైతన్యవంతుల్ని చేసేలా పోస్టులు పెడుతూ తనలోని స్త్రీవాదాన్ని చాటుతుండటం సామ్ స్పెషాలిటీ. తాజాగా ఇన్‌స్టాలో తను ఓ పద్యాన్ని షేర్ చేసింది. 'మిమ్మల్ని అందరూ నిందిస్తున్నప్పుడు.. మీరు తలెత్తుకొని నిలబడితే.. పురుషులంతా మిమ్మల్ని అవమానించినప్పుడు.. మిమ్మల్ని మీరు నమ్మితే..' అంటూ ఈ పద్యం మొదలైంది. 'రిస్క్ చేసి ఓడిపోయావా!?.. కొత్త ప్రయాణం మొదలుపెట్టు. అంతేకానీ ఓటమి గురించి ఆలోచిస్తూ కూర్చోకు. హృదయాన్ని కఠినం చేసుకో.. సుదీర్ఘ ప్రయాణంకై ధైర్యంగా కదులు.. నీ దగ్గర ఏమీ లేనప్పుడు సంకల్పమే నిన్ను నడిపిస్తుంది. అప్పుడు నిన్ను నిందించేవారికి సైతం సమాధానం చెప్పొచ్చు.' అంటూ సాగిన ఈ పద్యాన్ని పోస్ట్ చేసి, దీన్ని అందరితో పంచుకోవాలని ఉందని క్యాప్షన్ జతచేసింది సామ్. ప్రస్తుతం సోషల్ మీడియాలో ఈ పద్యం బాగా వైరల్ అవుతున్నది.

# సంస్కృతంలో ప్రణయగీతం



రవితేజ సోదరుడు రఘు కుమారుడు మాధవ్ హీరోగా నటిస్తున్న చిత్రం 'మిస్టర్ ఇడియట్'. గౌరీ రోణంకి దర్శకత్వం వహిస్తున్నది. జేజేఆర్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై జేజే ఆర్ రవిచంద్ నిర్మిస్తున్నారు. త్వరలో ప్రేక్షకుల ముందుకురానుంది. బుధవారం ఈ సినిమా నుంచి 'వస్సాహి వస్సాహి..' అనే పాటను శివాజీ విడుదల చేశారు. సంస్కృతంలో రాసిన ఈ పాట అద్భుతంగా ఉందని ఆయన ప్రశంసించారు. అనూప్ రూబెన్స్ స్వరపరచిన ఈ పాటకు శివశక్తిదత్తా సాహిత్యాన్ని అందించారు. రామచంద్ర ఆలపించారు. 'సౌందర్య సార, మకరంద ధార, శృంగార పారవరా..వస్సాహి వస్సాహి' అంటూ ఈ పాట సంస్కృతంలో సాగింది. సిమ్రాన్ శర్మ, జయప్రకాష్, ఆచంట మహేష్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: రామ్‌రెడ్డి, సంగీతం: అనూప్‌రూబెన్స్, రచన-దర్శకత్వం: గౌరి రోణంకి.

# గాలిలో ఊగిసలాడే దీపంలా..



నాగచైతన్య, సాయిపల్లవి జంటగా నటిస్తున్న 'తండేల్' సినిమా మ్యూజికల్ ప్రమోషన్స్ మొదలయ్యాయి. గురువారం 'బుజ్జి తల్లి..' అనే పాటను విడుదల చేశారు. దేవిశ్రీప్రసాద్ స్వరపరచిన ఈ మెలోడీ గీతాన్ని శ్రీమణి రచించగా, జావేద్ అలీ ఆలపించారు. బాధలో ఉన్న ప్రియురాలిని కథానాయకుడు ఓదార్చే నేపథ్యంలో ఈ పాట సాగింది. 'గాలిలో ఊగిసలాడే దీపంలా.. ఊగిసలాడే నీ ఊసందక నా ప్రాణం.. నల్లని మబ్బులు చుట్టిన చంద్రుడిలా..చీకటి కమ్మెను నీ కబురందక నాలోకం.. సుడిగాలిలో పడిపడిలేచే పడవల్లా తడబడుతున్నా.. ఓ బుజ్జి తల్లి నీ కోసం..' అంటూ కథానాయకుడి మనోవేదనను ప్రతిఫలిస్తూ ఈ పాట సాగింది. సముద్రం నేపథ్యంలో విజువల్స్ ఆకట్టుకునేలా ఉన్నాయి. సముద్రం నేపథ్యంలో జరిగే యథార్థ ప్రేమకథగా ఈ చిత్రాన్ని తెరకెక్కించామని, మత్స్యకారుల జీవితానికి అద్దం పడుతూ దేశభక్తి ప్రధానంగా మెప్పిస్తుందని చిత్ర బృందం పేర్కొంది. గీతా ఆర్ట్స్ పతాకంపై అల్లు అరవింద్ సమర్పణలో చందూ మొండేటి రూపొందించిన ఈ చిత్రం ఫిబ్రవరి 7న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: షామ్‌దత్, సంగీతం: దేవిశ్రీప్రసాద్, స్క్రీన్‌ప్లే, సంభాషణలు, దర్శకత్వం: చందూ మొండేటి.



# రామ్ కొత్త సినిమా మొదలైంది

రామ్ పోతినేని హీరోగా అగ్ర నిర్మాణ సంస్థ మైత్రీ మూవీమేకర్స్ నిర్మిస్తున్న చిత్రం గురువారం హైదరాబాద్‌లో పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభమైంది. మహేష్‌బాబు పి. దర్శకత్వంలో నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి నిర్మిస్తున్న ఈ చిత్రం హీరోగా రామ్ 22వ చిత్రం కావడం విశేషం. ముహూర్తపు సన్నివేశానికి దర్శకుడు గోపీచంద్ మలినేని కెమెరా స్విచాన్ చేయగా, మరో దర్శకుడు హను రాఘవపూడి క్లాప్ ఇచ్చారు. వెంకీ కుడుముల గౌరవ దర్శకత్వం వహించారు. దర్శకులు శివ నిర్వాణ, పవన్ సాధినేని స్క్రిప్ట్‌ని మేకర్స్‌కి అందించారు. యువతకు నచ్చే అంశాలతోపాటు చక్కని కథ, కథనంతో సినిమా రూపొందనున్నదని, భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తున్నారని, ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలో వెల్లడిస్తామని దర్శక, నిర్మాతలు తెలిపారు.

# విడిపోవాలని నిర్ణయించుకున్నాం



తమిళ నటుడు ధనుష్, ఆయన సతీమణి ఐశ్వర్య రజనీకాంత్ విడాకుల కేసు విచారణలో భాగంగా గురువారం చెన్నై ఫ్యామిలీ కోర్టు ఎదుట హాజరయ్యారు. తామిద్దరం విడిపోవాలని నిర్ణయించుకున్నామని, కలిసి ఉండటం సాధ్యం కాదని న్యాయస్థానానికి తెలిపారు. విడిపోవడానికి గల కారణాలను కోర్టుకు తెలియజేశారు. ఈ నేపథ్యంలో కోర్టు తుది తీర్పును ఈ నెల 27కు వాయిదా వేసింది. సూపర్‌స్టార్ రజనీకాంత్ పెద్ద కుమార్తె అయిన ఐశ్వర్యను 2004 నవంబర్ 18న వివాహమాడారు ధనుష్. దాదాపు పద్దెనిమిది సంవత్సరాల పాటు వీరి దాంపత్యం సజావుగానే సాగింది. తామిద్దరం విడిపోవాలని నిర్ణయించుకున్నామని ధనుష్ రెండేళ్ల క్రితం సోషల్‌మీడియాలో పెట్టిన పోస్ట్ ద్వారా వెల్లడించారు. అప్పటి నుంచి ఈ కేసు విచారణ కొనసాగుతుండగా.. వారిద్దరూ కోర్టుకు హాజరుకాలేదు. ఈ నేపథ్యంలో మనస్పర్థలను పక్కనబెట్టి వారిద్దరూ మరలా ఒక్కటి కాబోతున్నారని ప్రచారం జరిగింది. తాజా విచారణతో ఈ జంట విడిపోవడానికే నిర్ణయించుకున్నట్లు స్పష్టమైంది.

# ప్రేక్షకులకు నేనే గుర్తుంటా



తెలుగమ్మాయి అంజలి చెప్పలేనంత ఆనందంగా ఉంది. దానికి కారణం 'గేమ్‌చేంజర్'. రామ్‌చరణ్ ద్విపాత్రాభినయం చేసిన ఈ సినిమాలో రామ్‌చరణ్‌కు భార్యగా, తల్లిగా రెండు షేడ్స్‌లో ఆమె కనిపించనుంది. రీసెంట్‌గా ఈ సినిమా గురించి ఆమె ఓ తమిళ మీడియాతో మాట్లాడింది. 'కొన్ని సినిమాలు డబ్బు కోసం చేస్తాం. కొన్ని సినిమాలు ఆత్మసంతృప్తికోసం చేస్తాం. నాకు రెండు విధాలా ఆనందాన్ని పంచిన సినిమా 'గేమ్ చేంజర్'. నాతోపాటు కైరా అద్వానీ కూడా ఇందులో హీరోయిన్‌గా నటించినా.. నా పాత్ర మాత్రం ఈ సినిమాలో ప్రత్యేకం. సినిమా చూసి బయటకొచ్చే ప్రేక్షకులకు రామ్‌చరణ్ తర్వాత నేనే గుర్తుంటా. నా కేరక్టర్ గొప్పతనం అలాంటిది. నా కెరీర్‌లోనే ఇది బెస్ట్ కేరక్టర్ అని నమ్మకంగా చెప్పగలను. ఓ విధంగా నేను ఛాలెంజ్‌గా తీసుకొని చేసిన పాత్ర ఇది. ఓ రామ్‌చరణ్‌కి భార్యగా, మరో రామ్‌చరణ్‌కు తల్లిగా నటించడం ఓ గొప్ప అనుభవం. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఇలాంటి పాత్రలు దొరకడం అరుదు. నా పాత్రలో అద్భుతమైన ట్విస్ట్ ఉంటుంది. అది తెరపై చూస్తేనే తెలుస్తుంది.' అంటూ చెప్పుకొచ్చింది అంజలి.



# ఫీల్‌గుడ్ లవ్‌స్టోరీ

హర్ష నర్రా, సందీప్ సరోజ్, తరుణ్, సుప్రజ్ రంగా, సోనూ ఠాకూర్, నువ్వేక్ష, మేఘలేఖ, ఖుష్బూ చౌదరి ప్రధానపాత్రధారులుగా రూపొందిన చిత్రం 'రోటీ కపడా రొమాన్స్'. విక్రమ్‌రెడ్డి దర్శకుడు. బెక్కెం వేణుగోపాల్, సృజన్‌కుమార్ బొజ్జం నిర్మాతలు. తొలుత ఈ సినిమాను ఈ నెల 22న విడుదల చేయాలనుకున్నారు. ఆ డేట్‌లో థియేటర్లు దొరకని కారణంగా సినిమా విడుదలను ఈ నెల 28కి వాయిదా వేశారు. తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాల్లో ఈ నెల 22 నుంచి ఈ సినిమా పెయిడ్ ప్రీమియర్లను ప్లాన్ చేశామని మేకర్స్ తెలిపారు. ఇంకా మాట్లాడుతూ 'ఈ ఏడాది విడుదలైన సినిమాల్లో ఉత్తమ ఫీల్‌గుడ్ మూవీ ఇది. యువతరం మెచ్చేలా సినిమా ఉంటుంది. ఇప్పటికే వేసిన షోలకు మంచి స్పందన వస్తున్నది..' అని చెప్పారు.


